# 22

# పన్నెండుమందికి ఉపదేశించుట

## (10:24-42)

అటుతరువాత, యేసు తన అపొస్తలులకు ఆదేశములిచ్చుచు, ఆయన ఇంతకు ముందుగానే హింసల గూర్చి వారికి తెలియజెప్పిన ప్రకారం కాదు వాటికి భయపడనవసరం లేదనుటకు ఇప్పుడు హేతువులు చూపించాడు. యేసు ఇచ్చిన ఆదేశముల ప్రధాన భాగము అపొస్తలుల కొరకు ఉద్దేశింపబడినదై యుండగా, 10:24లో ఒక మార్పు గుర్తింపబడనగును. ఇప్పటినుండి యిక ముందు కూడ యేసు మధ్యమ పురుష పదముతో ("మీరు") పాటు, అస్పష్టమైన ప్రథమ పురుష పదమునకు (ఉదా॥ "ఒక శిష్యుడు," "ప్రతివాడు," మరియు "ఎవడైనను") ప్రయోగించుటకు మొదలుపెట్టాడు. ఇక ముందు చెప్పబోవు విషయాలలో అధిక భాగము ఆయన అనుచరులై యుండగోరు ప్రతి శిష్యుని కొరకు ఉద్దేశింపబడినదని వ్యాకరణ సంబంధిత ఈ మార్పు అర్థమీయవలెను.

### శిష్యుడు వాని బోధకుని కంటె అధికుడు కాడు (10:24, 25)

**[24]శిష్యుడు బోధకునికంటె అధికుడు కాడు; దాసుడు యజమానునికంటె అధికుడు కాడు. [25]శిష్యుడు తన బోధకునివలెను దాసుడు తన యజమానునివలెను ఉండిన చాలును. యింటి యజమానునికి బయెల్జెబూలని వారు పేరుపెట్టి యుండినయెడల ఆయన యింటివారికి మరి నిశ్చయముగా ఆ పేరు పెట్టుదురు గదా.**

**వచనము 24**. అపొస్తలులు ఎదుర్కొననై యుండిన వైరభావముల గూర్చి వారిని హెచ్చరించిన తరువాత, యేసు ఈ విషయములో, మరి ముఖ్యముగా ఆయన తానే ఎదుర్కొనిన మర్యాద దృష్ట్యా వారు ఏ మాత్రమును అశ్చర్యపడనవసరం లేదని వారికి తెలియజెప్పాడు. **ఒక శిష్యుడు వాని బోధకుని కంటెను, ఒక దాసుడు వాని యజమానుని కంటెను అధికుడు కాడను సత్యమును ఇంగిత జ్ఞానము అంగీకరించుచున్నది**. శిష్యుడు తన బోధకుని అనుసరించుచు ఆయన నుండి నేర్చుకొనును. ఈ నానుడి మొదటి వాక్యమును లూకా ఒక భిన్నమైన సందర్భంలో గ్రంథస్థంచేస్తూ, "సిద్ధుడైన ప్రతివాడును తన బోధకునివలె ఉండునని" అదనంగా చేర్చాడు (లూకా 6:40). ఆయన ఒక్కడు మాత్రమే వారి బోధకుడని యేసు ఉద్ఘాటించి చెప్పాడు (23:8). యేసు శ్రమలనుభవించాడు గనుక, ఆయన శిష్యులు సహితము శ్రమలనుభవించుటకు ఎదురుచూడవలెను (1 పేతురు 2:21; 4:1).

అటుతరువాత, యోహాను 13:16లో, "దాసుడు తన యజమానుని కంటె గొప్పవాడు కాదు, పంపబడినవాడు తన్ను పంపినవానికంటె గొప్పవాడు కాదని" యేసు వారితో చెప్పాడు. ఈ వాక్యభాగములో, "పంపబడినవాడు" అను పదము "అపొస్తలుడు" అని కూడ అనువదింపబడవచ్చును. యోహాను 15:20లో, యేసు ఒక దాసుని గూర్చిన వాంగ్మూలమును పునఃరుక్తం గావించుచు, "లోకులు నన్ను హింసించిన యెడల, మిమ్మును

కూడ హింసింతురు; వారు నా మాట గైకొనిన యెడల, మీ మాట కూడ గైకొందురని" పలికాడు. సంబంధిత సూక్తి పలుకులు యూదా మత బోధకుల సాంప్రదాయములో అగుపించును: "ఒక దాసుడు వాని యజమాని వలె ఉన్నట్లయితే అది చాలును."[1]

**వచనము 25. శిష్యునికిని బోధకునికిని మధ్య నుండు సాంగత్యమునుబట్టి,** ఇతరులు ఈ ఇరువురి యెడల ఒకే విధముగా వ్యవహరించినప్పుడు, శిష్యుడు బోధకుని వలె, లేదా దాసుడు వాని యజమానుని వలె (ఉండును). యేసు క్రీస్తు మరియు ఆయన శిష్యులు హింసలకు గురియైన సందర్భములో ఇది వారి గూర్చి వాస్తవమై యుండినది, ఏలయనగా వారందరును ఒకే విధముగా వ్యవహరింపబడిరి.

ఆయన **ఇంటి యజమానుడని** తనను గూర్చియు, గనుక ఆయనను వెంబడించువారు **ఆయన ఇంటివారనియు** యేసు సూచించాడు. ఈ భాష ఇదివరకటి యజమానుడు మరియు అతని దాసులు గూర్చిన మనఃకల్పనకు సమాంతరముగా నున్నది. యజమాని, "ఇంటి పెద్దయై" యుండెను, గనుక అతని దాసులు "తన ఇంటివారి సభ్యులుగా" పరిగణింపబడిరి. ఆయన శిష్యులు ఆయన కంటె యింకా అధికమైన తిరస్కార దృష్టితో వ్యవహరింపబడుదురని నొక్కివక్కాణింపబడుదురని నొక్కివక్కాణించుటకు ఇచ్చట యేసు **మరి నిశ్చయముగా** అను వాదనను వినియోగించాడు. ఆయనను విమర్శించుచుండినవారు ఆయనను **బయల్జెబూల్** అని, అనగా "దయ్యముల అధిపతి" యని సంబోధించుచు ఆయనను అపకీర్తి పాలు చేసారు. యేసు విషయంలో ఈ పదము ప్రయోగింపబడుట వారు ఆయనను ఎంత మేరకు ద్వేషించుచుండిరో, ఆయన యెడల ఎంత అమర్యాదగా ప్రవర్తించిరో అర్థమౌతోంది. ఈ విధముగా వారు ఆయనకు సాతానుతో సంబంధమును జోడించుచు వారు బోధకున్ని ఈ బిరుదుతో సంబోధించినట్లయితే (మార్కు 3:22, 23), ఆయనను వెంబడించువారి యెడల వారు యింకెంత ఘోరంగా వ్యవహరించవచ్చునో కదా? డగ్లస్ ఆర్. ఏ. హేర్ ఇలా వ్యాఖ్యానించుచున్నాడు, "బయల్జెబూల్ గూర్చిన ప్రస్తావన ఈ వాక్యభాగమును 9:34తోను, యేసు చేసిన మహత్కార్యముల పట్ల ప్రదర్శింపబడిన వ్యతిరేకార్థక ప్రతిస్పందనయై యున్న దాని వాంగ్మూలముతోను ముడిపెట్టుచున్నది, గనుక ఇతివృత్తము యింకా ఎక్కువ నిండుగా అన్వేషింపబడిన 12:22–32, వైపు అది ముందుగానే దాని దృష్టిని మళ్లించుచున్నది."[2]

"బయల్జెబూల్" అను పేరు యొక్క ఖచ్చితమైన అర్థము వివాదగ్రస్తమై యున్నది.[3] ఈ పదమునకు "(ఆకాశమండల) నివాసముల వల్లభుడు/యజమాని" అను అర్థమున్నదని కొందరు వారి తుది అభిప్రాయమును వెలిబుచ్చారు. ఇదే నిజమైనట్లయితే, అప్పుడు బహుశ యేసు "ఇంటి యజమాని" (*oikodespotēs*) గూర్చి చేసిన ప్రస్తావన, మాటల చమత్కారమై యుండును. ఈ నామమునకు "పెంట అధిపతి" యను అర్థమున్నదని ఇతరులు చెప్పుచున్నారు. సంబంధిత నామమైన "బయల్జెబూబు"నకు "ఈగల అధిపతి" యని అర్థము. ఇది ప్రథమమందు కనానీయుల దేవత నామమై యుండెను (2 రాజులు 1:2, 3, 6, 16). ఈ నామముల అర్థముతో నిమిత్తము లేకుండా, యూదులైన నాయకులు యేసును సాతాను అని సూచించుటయే వారు ఆయన యెడల ప్రదర్శించిన తీవ్రమైన అవమానమై యుండినది.

## భయపడకుడి (10:26–31)

**26కాబట్టి మీరు వారికి భయపడకుడి. మరుగైనదేదియు బయలుపరచబడకపోదు,
రహస్యమైనదేదియు తెలియబడకపోదు. 27చీకటిలో నేను మీతో చెప్పునది మీరు
వెలుగులో చెప్పుడి; చెవిలో మీకు చెప్పబడినది మేడలమీద ప్రకటించుడి. 28మరియు
ఆత్మను చంపనేరక దేహమునే చంపువారికి భయపడకుడి గాని, ఆత్మను దేహమును
కూడ నరకములో నశింపజేయగలవానికి మిక్కిలి భయపడుడి. 29రెండు పిచ్చుకలు
కాసుకు అమ్మబడును గదా; అయినను మీ తండ్రి సెలవులేక వాటిలో ఒకటైనను నేలను
పడదు. 30–31మీ తలవెంట్రుకలన్నియు లెక్కింపబడి యున్నవి గనుక మీరు భయపడకుడి;
మీరనేకమైన పిచ్చుకలకంటె శ్రేష్ఠులు.**

వారిని హింసించువారి గూర్చి అపొస్తలులు ఎందుకు భయపడవలసిన అవసరం లేదో యని యేసు ఆదరణనిచ్చు హేతువులను వారికి సమకూర్చాడు. "భయపడకుడి" అను ఆజ్ఞ ఈ పేరాగ్రాఫ్‌లో ముమ్మారు దర్శనమిచ్చుచున్నది (10:26, 28, 30–31).

**వచనములు 26, 27. భయపడకుడి** అని యేసు అపొస్తలులకు చెప్పాడు ఏలయనగా వారి హింసల ఫలితముగా ఏదో ఒక మంచి విషయము ఫలిస్తుంది (అపొస్తలుల కార్యములు 8:1–4; ఫిలిప్పీయులకు 1:12–14, 19, 20 చూడు). వారు నిర్వర్తించుటకు వారికొక పని అప్పజెప్పబడినది: రాజ్య సందేశమును బోధించుటకు. వారు ఎదుర్కొను హింసలు ఎటువంటివైనను వాటితో నిమిత్తము లేకుండా, ఆ మహత్కార్యము నెరవేరును. ఇదివరకు **దాచబడి యుండినది** లేక **మరుగై యుండినది** ఇప్పుడు **బయలుపరచబడును** (మార్కు 4:22; లూకా 8:17; 12:2, 3 చూడు).

యేసు వారికి ఏకాంతముగా ఉపదేశించిన విషయములను వారు త్వరలోనే బాహాటముగా ప్రచురించనై యుండిరి: **చీకటిలో నేను మీతో చెప్పునది మీరు వెలుగులో చెప్పుడి; చెవిలో మీకు చెప్పబడినది మేడల మీద ప్రకటించుడి.** ఆయన పునరుత్థానుడై ఆరోహణమైన పిదప, ఈ విషయములన్నిటిని వారికి జ్ఞాపకము చేయుచు, వారిని సర్వ సత్యములోనికి నడిపించుటకై యేసు పరిశుద్ధాత్మను పంపును (యోహాను 14:26; 16:13, 14; అపొస్తలుల కార్యములు 2:1–4). ఆ సమయములో, వారు బహిరంగముగా, యేసును "ప్రభువుగాను మరియు క్రీస్తుగాను" ప్రకటించుదురు (అపొస్తలుల కార్యములు 2:36).

"మేడల మీద ప్రకటించుడి" అను మాటలు "బాహాటముగా ప్రకటించుడి" అని తెలియజేయుచున్న ఆలంకారయుక్తమైన భాషయై యున్నది. ఆ రోజుల్లో, ఏవరైనా ఒకరు ఒక సందేశమును పదిమందికి తెలియునట్లు ప్రసారము చేయవలెనని ఆశించినట్లయితే, అతడు ఒక ఎత్తైయిన కొండమీదికి లేక మేడమీదికి ఎక్కి చుట్టూర ఉన్నవారందరికి వినబడునట్లు బిగ్గరగా కేకలు వేయుచుండెను. బూరలు ఊదుచుండినవారు మతపరమైన సెలవుదినములు ఆరంభమగుచున్నవని చాటించునట్లు వారి పొట్టేలు కొమ్ములతో మేడలు మీదికి ఎలా అధిరోహించారో టాల్ముడ్ తెలియజెప్పుచున్నది.[4]

**వచనము 28.** యేసు అనుచరులు వారి శత్రువులకు **భయపడకూడదు** ఏలయనగా శత్రువులు ఆయన శిష్యులకు కలిగించు హాని పరిమితమైనదై యుండినది. వారు **దేహమును చంపగలరు,** కానీ **ఆత్మను చంపనేరరు.** "ఆత్మ" అను అర్థమిచ్చుచున్న గ్రీకు పదము (*psuchē*), *nepesh* అను హెబ్రీ పదమునకు సమాంతరమై యుండి, జీవ వాయువు,

జీవ సూత్రమును, ఇహలోక జీవము, ఆంతర్య మానవ జీవితము (కోరికలు మరియు భావావేశములతో కూడ), వ్యక్తి, మరియు ఆత్మ (ఇది ఐహిక జీవితమును అధికమించును) వంటి అనేక అర్థములు కలిగియున్నది.[5] ఈ సందర్భములో, చివరి అర్థము దృష్టికోణములో ఉన్నదని స్పష్టమగుచున్నది. దేహము చంపివేయబడగలదు, కానీ ఆత్మ జీవించుచునే యుండును (11:29; 16:26; మార్కు 8:36, 37; లూకా 12:20; హెబ్రీయులకు 6:19; 1 పేతురు 1:8-9, 22-23; 2:11; 4:19; యాకోబు 1:21; 5:20 చూడు). యేసు క్రీస్తును విశ్వసనీయముగా వెంబడించుచుండువారు దేహమును కోల్పోయినప్పటికిని, వారు "నిత్య శిక్షను" లేక "రెండవ మరణమును" ఎదుర్కొనరు (25:46; ప్రకటన 20:14). వారి శత్రువులు అగోచరము మరియు అప్రస్తుతముగా మానవునిలో భాగమైయున్నదానికి ఎటువంటి హానినైనను కలుగజేయలేకపోయారు.

మనుష్యులకు భయపడుటకు బదులుగా, వారు **ఆత్మను మరియు దేహమును కూడ నరకములో నశింపజేగలవానికి మిక్కిలి భయపడవలెనని** యేసు వారికి ఆదేశమిలిచ్చాడు. ఇచ్చట రెండు విధములైన "భయము"లకు తారతమ్యము చూపింపబడినది: మనుష్యులకు భయపడుట స్వార్థముతో కూడిన భయమై యున్నది, కానీ దేవుని యెడల నుండు భయము ఆరోగ్యవంతమైనదియు నైతికముగా ప్రయోజనకరమైనదై యున్నది.[6] మనము దేవునికి భయపడవలెను ఏలయనగా ఆయనే "రక్షించుటకును నశింపజేయుటకును శక్తిమంతుడై యున్నాడు" (యాకోబు 4:12).

"నశింపజేయు" అను అర్థమిచ్చు గ్రీకు పదము (*apollumi*) సమూలంగా నాశనము చేయబడుటయను భావము నియ్యదు. ఆత్మ మరియు దేహము అవి నరకములో వేయబడినప్పుడు నశింపజేయబడును. ("నరకము" గూర్చిన వివరముల కొరకు 5:22పై గల వ్యాఖ్యానము చూడు.)

**వచనములు 29-31.** యేసు అనుచరులు భయపడకూడదు ఏలయనగా **తండ్రియైన** దేవుడు తన ప్రజలను ఒక కంట కనిపెట్టుచు వారిని కాపాడుచునే యుండును. **పిచ్చుకలు** చాలా తక్కువ వెలగలవై యున్నవి. మొదటి శతాబ్దములో అవి కొన్ని పర్యాయములు ఆహారముగా సేవించుచుండినవి, కానీ ఈ పని బీదలు మాత్రమే చేయుచుండిరి ఏలయనగా అవి చాలా చౌక ధరకే లభ్యమగుచుండినవి. **రెండు** పిచ్చుకల వెల ఒక **కాసు** మాత్రమే. లూకా 12:6లో, ఐదు పిచ్చుకలు రెండు కాసులకు అమ్మబడినవి; ఐదవ పిచ్చుక బేరమాడగా ఊరకనే ఇవ్వబడినది.[7] "కాసు" అని అర్థమిచ్చు గ్రీకు పదము (*assarion*) యేసు కాలములో చలామణి యగుచుండిన ఒక చిన్న రాగి నాణెమును సూచించుచున్నది. దాని వెల ఒక దేనారములో పదహారవ భాగమై యుండినది.[8] పిచ్చుకలు చూపునకు అప్రధానమైనవైనప్పటికిని, దేవుని ఎరుక లేకుండా వాటిలో ఒకటైనను **నేలనుపడదు,** లేక చావదు.

ఈ సమయం, యేసు ఆశ్చర్యార్థముగా అంతరాయము కలిగించుచు, **మీ తలవెండ్రుకలన్నియు లెక్కింపబడి యున్నవని** పలుకుచున్నాడు. డేవిడ్ మెంటన్ ప్రకారము, ఒక మనిషి తలలో నుండు వెంట్రుకల సగటు సంఖ్య 100,000 అని అంచనా వేయబడినది.[9] అయితే ఇటువంటి అంచనా ఎలా వేయబడగలదా యని మనము ఆశ్చర్యపడుదుము! మన జీవితములో అంతగా ప్రధానమైనవి కానివి మరియు అత్యల్పములై యున్న విషయముల

గూర్చి దేవునికి పూర్తిగా తెలియునని యేసు ధ్వనించుచుండెను. ఇతర సందర్భములలో, దేవుని కాపుదల "మీ తల వెంట్రుకలలో ఒకటైనను నశించదను" వాగ్దానములో అభివ్యక్తము చేయబడినది (లూకా 21:18; అపొస్తలుల కార్యములు 27:34 చూడు).

దేవుడు మానవుల యెడల, ప్రత్యేకముగా ఆయన శిష్యుల యెడల (6:26పై గల వ్యాఖ్యానములను చూడు), ప్రదర్శించుచుండు ఆందోళన గూర్చి నొక్కివక్కాణించుటకు యేసు "అల్పమైన దాని నుండి గొప్పదైన దాని వరకు" అను వాదనను ప్రయోగించుచుండెను. **గనుక మీరు భయపడకుడి మీరనేకమైన పిచ్చుకల కంటె శ్రేష్ఠులని** పలుకుచు ఆయన ఈ వాదనను ముగించాడు. ఆయన ప్రజలు శ్రమనొందునప్పుడు (మరియు మరణించినప్పుడు సహితము) ఆ విషయము దేవునికి ఎరుకే, ఏలయనగా ఆయన వారి గూర్చి చింతించుచున్నాడు. సంబంధిత ఒక లోకోక్తి యెరూషలేము టాల్ముడ్‌లో అగుపించుచున్నది: "పరలోకము (దేవుడు) లేకుండా, ఒక పక్షియైనను నశించదు అంత కంటే ఎక్కువగా, ఒక్క మానవ జీవియైనా నశించదు!"[10]

## నన్ను ఒప్పుకొను ప్రతివాడు (10:32, 33)

**[32]మనుష్యులయెదుట నన్ను ఒప్పుకొనువాడెవడో పరలోకమందున్న నా తండ్రి యెదుట నేనును వానిని ఒప్పుకొందును. [33]మనుష్యులయెదుట ఎవడు నన్ను ఎరుగననునో వానిని పరలోకమందున్న నా తండ్రియెదుట నేనును ఎరుగనందును.**

**వచనము 32. మనుష్యుల యెదుట ఆయనను ఒప్పుకొను ప్రతి ఒక్కరికి** అతి గొప్ప ఆశీర్వాదములను ఆయన వాగ్దానము చేయుచు, వారు నిర్భయులై యుండవలెనని యేసు ఆయనను వెంబడించుచుండినవారిని ప్రేరేపించుట కొనసాగించాడు. "ఒప్పుకొనుట" యను అర్థమిచ్చు గ్రీకు పదమునకు (*homologeō*) వెల్లడించుట లేక అంగీకరించుట యను భావము కలదు. యేసు క్రీస్తును గూర్చిన ఖచ్చితమైన ఒప్పుకోలు ఇచ్చుట నిర్దిష్టముగా చెప్పబడలేదు. కొండ మీద ప్రసంగములో, ఆయనను "ప్రభువు" అని ఒప్పుకొనిన కొందరి గూర్చి యేసు విశదీకరించాడు: ఏదిఏమైనా, వారి నమ్మకము గూర్చి వారు ఒప్పుకొనుచుండిన దానికిని, వారి క్రియలకును పొంతన లేకుండుటనుబట్టి వారు తృణీకరింపబడుదురు (7:21–23). అటుతరువాత, "మంచి ఒప్పుకోలు" అని పిలువబడు ఒప్పుకోలును "నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తువని" పలుకుచు పేతురు ఒప్పుకొన్నాడు (మత్తయి 16:16).

యేసు శిష్యులు యూదా మత న్యాయస్థానముల యెదుటికిని, అన్యజనుల పైఅధికారులు మరియు రాజులు యెదుటికిని తీసికొనిరాబడుదురు (10:17, 18). ఇటువంటి సంఘర్షణలు యేసు క్రీస్తును ఒప్పుకొనుటకు సదావకాశములై యుండినవి. శిష్యులు వారి ఒప్పుకోలును నిర్వహించుకొనుచుండునట్లు వారు హింసలకు సంబంధించిన ఎటువంటి భయమునైనను అధిగమించవలసి యుండినది. యేసు తానే "పొంతి పిలాతు యెదుట మంచి ఒప్పుకోలును ఒప్పుకొన్నాడు" (1 తిమోతి 6:16; 27:11 చూడు) – అయితే అది చివరకు ఆయన సిలువమరణమునకు దారి తీసినది.

యోహాను వ్రాసిన సువార్తలో, యూదులలో అనేకులు యేసు నందు వారికుండిన

విశ్వాసమును వెల్లడి చేయుటకు భయపడుచుండిరి ఏలయనగా, "ఆయన క్రీస్తు అని యెవరైనను ఒప్పుకొనిన యెడల వారిని సమాజమందిరములో నుండి వెలివేతుమని" వారి నాయకులు తీర్మానించారు (యోహాను 9:22). కొందరు పరిపాలకులు సహితము యేసు నందు విశ్వాసముంచారు కానీ "వారు సమాజమందిరములో నుండి వెలివేయబడుదురను భయమునుబట్టి" ఒప్పుకొనలేదు (యోహాను 12:42).

ఒకడు క్రైస్తవుడు కాకమునుపు అతడు క్రీస్తునందు విశ్వసించుచున్నాడని ఒప్పుకొనవలసిన అవసరమున్నది (రోమీయులకు 10:9, 10; 1 తిమోతి 6:12). ఆ ఒప్పుకోలు ఏమనగా, యేసు "సజీవుడైన దేవుని కుమారుడై యున్నాడు" (16:16; అపొస్తలుల కార్యములు 8:37 చూడు). అనగా క్రీస్తును ప్రభువుగాను బోధకుడుగాను ఒప్పుకొనుట యను భావమునిచ్చుచున్నది. ఒక క్రైస్తవుడు క్రీస్తు నందలి విశ్వాసమును ఒప్పుకొనుటనుబట్టి హింసింపబడవచ్చును మరియు వాని ప్రాణమును సహితము పోగొట్టుకొనవలసిన పరిస్థితి ఏర్పడవచ్చును. అట్లయినప్పటికిని, యేసు – "దేవునికిని నరులకును మధ్యవర్తియైనవాడు" (1 తిమోతి 2:5; NIV) – **వానిని పరలోకమందున్న** [తన] **తండ్రి యెదుట ఒప్పుకొనును.** "పరలోకమందున్న నా తండ్రి యెదుట" అనుటకు బదులుగా, "దేవుని దూతల యెదుటను" అని లూకా వ్రాయుచున్నాడు (లూకా 12:8, 9).

**వచనము 33**. వ్యతిరేకమైన దానిని చెప్పుట ద్వారా, యేసు ఆయన నుండి దూరముగా వెళ్లిపోవు ప్రతి శిష్యుని హెచ్చరించాడు: **మనుష్యుల యెదుట ఎవడు నన్ను ఎరుగననునో, వానిని పరలోకమందున్న నా తండ్రి యెదుట నేనును ఎరుగనందును.** క్రియా పదము "ఎరుగననుట" (*arneomai*) యొక్క అర్థము, "తనకు సంబంధం లేదని చెప్పుట" లేక "తోసిపుచ్చుటయై" యున్నది. మొదటి సందర్భములో, యేసు తనకు ప్రభువు కాదని చెప్పుటను సూచించుచున్నది. పేతురు యేసును ఎరుగనని బొంకుట గూర్చి ప్రస్తావించినప్పుడు అది ఇదే విధానములో వాడబడినది (26:70, 72, 74). రెండవ సందర్భములో, అతడు ఆయన శిష్యుడు కాడని యేసు క్రీస్తు వానిని (అవిశ్వాసిని) ఒప్పుకొనకపోవుటను సూచించుచున్నది (7:23; 2 తిమోతి 2:12 చూడు).

వారు క్రీస్తును ఒప్పుకొనకుండునట్లు ఆదిమ క్రైస్తవులు తీవ్రమైన ఒత్తిడికి గురయ్యారు. ఉదా॥ క్రీ.శ. రెండవ శతాబ్దము తొలి రోజుల్లో, ప్లిని ది యంగర్, పొంతు/బితునియ గవర్నర్, అతనిని బహిరంగముగా తూలనాడిన క్రైస్తవుల పట్ల అతడు వ్యవహరించుచుండిన విధానము గూర్చి రోమా చక్రవర్తికి ఉత్తరము రాసాడు. వారు క్రైస్తవులై యున్నారని నేరారోపణ చేయబడినవారిని, వారు క్రీస్తును ఒప్పుకొనకుండుటకు అవకాశములను కలుగజేయుచు, ఆయన వారిని రెండు మూడు పర్యాయములు ప్రశ్నించాడు. వారి విశ్వాసము గూర్చిన అభిప్రాయమును మార్చుకొనినవారిని ఆయన ఉరితీసాడు. ఏదిఏమైనా, వారు రోమా దేశ పౌరులైనట్లయితే, ఆయన వారిని రోమా పట్టణమునకు పంపించాడు. వారు క్రీస్తు నందు విశ్వాసించుటలేదని ఒప్పుకొనినవారు క్రీస్తును శపించి, దేవతలను ఆమంత్రణము చేసి, చక్రవర్తి ప్రతిమకు సుగంధ ద్రవ్యములతో ధూపము వేయుచు, ద్రాక్షారసము జల్లుచు ప్రార్థన చేసిన పిదప విడుదల చేయబడిరి.[11]

## నేను సమాధానమును తెచ్చుటకు రాలేదు (10:34-36)

**[34]నేను భూమిమీదికి సమాధానమును పంపవచ్చితినని తలంచకుడి; ఖడ్గమునే గాని సమాధానమును పంపుటకు నేను రాలేదు. [35]ఒక మనుష్యునికిని వాని తండ్రికిని, కుమార్తెకును ఆమె తల్లికిని, కోడలికిని ఆమె అత్తకును విరోధము పెట్టవచ్చితిని. [36]ఒక మనుష్యుని యింటివారే అతనికి శత్రువులగుదురు.**

**వచనము 34.** ఇచ్చట యేసు సమాధానము గూర్చి చేయుచున్న ఘోషణ ఆయన ఈ లోకములోనికి రావడములో గల సంకల్పమును వ్యతిరేకించునట్లు అగుపించుచున్నది. "సమాధాన కర్త యగు అధిపతి" యని పిలుచుచు యెషయా ఆయన పరిపాలన సమాధానము నిండినదై, న్యాయముగలదై యుండుట గూర్చి మాట్లాడుచున్నాడు (యెషయా 9:6, 7). ఆయన నిశ్చయముగా చెప్పుచున్న ఈ విషయాన్ని మనము ఎలా అనువాదించవలెను? **సమాధానము** లేని పరిస్థితి కఠిన హృదయముల వలన కలుగు ఫలితమై యున్నదని మనము గమనించవలెను. యేసు చెప్పినది మరియు ఆయన చేసినది ప్రజల మధ్య విభజనలు సృష్టించినది వారు ఆయన యెడల ప్రతిస్పందించిన దాని ఫలితంగా ఈ విభజనేర్పడినది. యేసును తృణీకరించువారు వాస్తవముగానే ఆయనను స్వీకరించువారితో సమాధానము కలిగి యుండరు. **ఖడ్గము** గూర్చిన ప్రస్తావన "విభేదము" లేక "విభజన" గూర్చి ఒక రూపకాలంకారముగా ప్రయోజనపడును (లూకా 12:51). యేసు సమాధాన కర్తయగు అధిపతియై యున్నాడు (లూకా 2:14; ఎఫెసీయులకు 2:14–18), కానీ ఆయన సమాధానము, లోకమిచ్చు సమాధానమువంటిది కాదు (యోహాను 14:27; గలతీయులకు 5:22).

**వచనములు 35, 36.** ఈ వచనములలో, యేసు మీకా 7:6లో గల విషయాన్ని ఉల్లేఖించి చెప్పాడు. ఆయన అభిమతము విభజనలు సృష్టించుట కాదు కాని ప్రజలను సామరస్యముతో ఒక్క చోట జీవింపజేయుటయై యుండగా, సువార్త ప్రకటనకు ఫలితము తరుచుగా విభజనలై యుంటున్నవి. ఆయన సందేశము కుటుంబములను సహితము వేరు చేయును, ఏలయనగా ఒక కుటుంబములోని కొందరు సభ్యులు ఆయన సందేశమును అంగీకరించవచ్చును మరి కొందరు దానిని నిరాకరించవచ్చును. యేసు సొంత కుటుంబములో కూడ ఇదే జరిగింది (మార్కు 3:20, 21, 31–35; యోహాను 7:1–9). యేసు ఉపదేశముల యెడల ఒకరు విశ్వసనీయమైనవారై యుండగా మరొకరు అలా లేనప్పుడు అత్యంత సన్నిహితమైనవై యున్న సంబంధములు సహితము విచ్ఛిన్నము కాగలవు. ఒక **తండ్రి** మరియు ఒక **తల్లి** వారి పిల్లలకు వ్యతిరేకులై యుండగలరు. ఇటువంటి విభేదములు తలెత్తినప్పుడు, అదే **కుటుంబమునకు చెందినవారు** తరుచుగా **శత్రువులగుదురు** (10:21పై గల వ్యాఖ్యానములు చూడు).

### ఇతరులందరి కంటె ఎక్కువగా నన్ను ప్రేమించుడి (10:37–39)

**[37]తండ్రినైనను తల్లినైనను నాకంటె ఎక్కువగా ప్రేమించువాడు నాకు పాత్రుడు కాడు; కుమారునినైనను కుమార్తెనైనను నాకంటె ఎక్కువగా ప్రేమించువాడు నాకు పాత్రుడు కాడు; [38]తన సిలువను ఎత్తికొని నన్ను వెంబడింపనివాడు నాకు పాత్రుడు కాడు. [39]తన**

**ప్రాణము దక్కించుకొనువాడు దాని పోగొట్టుకొనును గాని నా నిమిత్తము తన ప్రాణము పోగొట్టుకొనువాడు దాని దక్కించుకొనును.**

**వచనము 37.** వారు తమ సొంత కుటుంబ సభ్యుల కంటె ఎక్కువగా ఆయనను ప్రేమించవలెనని చెప్పుచు, ఆయనను వెంబడించుచుండినవారి ముందు యేసు ఒక సవాలు ఉంచాడు. ఒకడు యేసు శిష్యుడు కావాలనుకుంటే, "తన తండ్రిని తల్లిని భార్యను పిల్లలను అన్న దమ్ములను అక్క చెల్లెండ్రను" ద్వేషించాలని లూకా 14:26లో ఆయన చెప్పాడు. ఆయన శిష్యులు కావాలనుకుంటే, తన కుటుంబం యెడల ప్రేమకూడ ఆయనకు తనకు మధ్య అడ్డు రాకూడదు. లూకా 14:26 యొక్క అర్థాన్ని మత్తయి 10:37 వివరిస్తుంది. "ద్వేషించు" అని ఆయన ఇచ్చిన ఆజ్ఞ యొక్క అర్థము "తక్కువగా ప్రేమించుటయై" యున్నదని స్పష్టముగా తెలియుచున్నది (ఆదికాండము 29:31 చూడు; KJV). ఆయన శిష్యులు ఎవరినైనను ద్వేషింపవలెనని యేసు ఆశించడు. కానీ ఇతరుల యెడల వారికుండు స్వామిభక్తి, వారు యేసు యెడల కలిగియుండు ప్రభుభక్తి కంటె అప్రధానమైనదై యుండవలెను. లేదంటే, వారు ఆయన శిష్యులని పిలువబడుటకు యోగ్యులు కారు.

**వచనము 38. తన సిలువను ఎత్తికొని నన్ను వెంబడింపనివాడు నాకు పాత్రుడు కాడు** అని చెప్పుచు, యేసు అపొస్తలుల యెదుట మరొక సవాలునుంచాడు. సువార్తలలో 'సిలువ' పేర్కొనబడుట ఇదే మొదటిసారి (16:24; మార్కు 8:34; లూకా 9:23 చూడు). మరణ శిక్ష విధింపబడిన నేరస్థుడు వాడు సిలువవేయబడవలసిన చోటికి వాడే తన సిలువను మోయవలసియుండునని రోమా ప్రభుత్వము చేత వాడు బలవంతము చేయబడుచుండిన వాడుక నుండి ఈ మనఃకల్పన తీసికొనబడినది.[12] శ్రమ, అవమానము, మరియు చివరకు మరణము – వీటన్నిటికి సిలువ ఒక సంకేతమై యుండినది. ఇచ్చట అది యేసు శిష్యులు వహించవలసి యుండిన భారమును ప్రాతినిధ్యము వహించుచు, వారు ప్రభువు యెడల విశ్వసనీయమైనవారై యుండునట్లు వారు చేయవలసియుండు ఏ త్యాగమునైనా అనివార్యము చేయుచున్నది. సిలువను ఎత్తికొనుట అనగా, ఒకడు తన సొంత ప్రాణమునే పోగొట్టుకొనవలసిన అవసరం ఏర్పడవచ్చును. ఒకడు తన సిలువను ఎత్తుకొనుట గూర్చిన ఆలోచనకు, ఎడతెరిపిలేకుండా కొనసాగుచుండు ప్రక్రియయని సూచించుచున్న "ప్రతి దినము" అను పలుకులను లూకా అదనంగా చేర్చాడు (లూకా 9:23). ఒకడు తన సిలువను ఎత్తికొనుటలో విఫలుడగుట వలన, గొల్గొతా వరకు తన సిలువను మోసికొనివెళ్లిన ఆయనకు వాడు శిష్యుడై యుండుటకు అయోగ్యుడగును (యోహాను 19:17).

**వచనము 39.** ఇంకా, **తన ప్రాణము దక్కించుకొనువాడు దానిని పోగొట్టుకొనును, గాని నా నిమిత్తము తన ప్రాణమును పోగొట్టుకొనువాడు దాని దక్కించుకొనును** అని కూడ యేసు సెలవిచ్చాడు (16:25; మార్కు 8:35; లూకా 9:24; 17:33; యోహాను 12:25 చూడు). ఒకడు తన ప్రాణమును దక్కించుకొనుట యనగా అది స్వయంసంరక్షణ మరియు స్వయంసంతృప్తితో సంబంధముగల విషయమై యున్నది. ఒకడు తన కొరకే జీవించునట్లయితే, వాడు దేవుని నుండి శాశ్వతముగా వేరుచేయబడును, అనగా, వాడు తన ప్రాణమును పోగొట్టుకొనును. దీనికి భిన్నంగా, తన సొంత కోరికలకు చచ్చిపోవువాడు – హతసాక్షిగా తన ప్రాణమునైనను ఇచ్చువాడు – దేవునితో కూడ నిరంతరము నివసించును.

పరలోకములో ప్రవేశించగలుగునట్లు ఏ త్యాగమునైనను చేయుటకు గల ఇష్టము ఒకడు వెదకవలసియున్న చిత్తవృత్తియై యున్నది. ఎట్టి పరిస్థితులలోనైనను యేసు యెడల విశ్వసనీయమైనవారుగా నిలిచియుండువారు, అంతము వరకు సహించువారు, నిత్య జీవ వైభవమును పొందుదురు.[13] ఈ ఆలోచనను జేమ్స్ బర్టన్ కోఫ్మన్ సంగ్రహముగా ఇలా చెప్పాడు,

> దేవుని చిత్తమును వెంటాడుటలో ఎటువంటి అనిశ్చయతయైనను లేకుండా తన ప్రాణమును అర్పించుకొనువాడు … ఈ వచనములో గల భావమునుబట్టి తన ప్రాణమును పోగొట్టుకొనును. ఒకడు, "ఇకను జీవించువాడను నేను కాను, కానీ క్రీస్తే నాయందు జీవించుచున్నాడని" పౌలుతో కూడ చెప్పగలుగునట్లు (గలతీయులకు 2:20), వాడు తన సొంత ప్రాణమును మరియు ఇష్టమును క్రీస్తు యొక్క ప్రాణమును మరియు ఇష్టముతో మిళితము చేయుచున్నాడనంటే, అతడు తన సొంత ప్రాణమును పోగొట్టుకొనుచున్నాడనియు, దానిని కనుగొనుచున్నాడనియు కూడ అర్థమిచ్చును.[14]

## మిమ్మును చేర్చుకొనువాడు నన్ను చేర్చుకొనును (10:40–42)

**[40]మిమ్మును చేర్చుకొనువాడు నన్ను చేర్చుకొనును; నన్ను చేర్చుకొనువాడు నన్ను పంపినవానిని చేర్చుకొనును. [41]ప్రవక్త అని ప్రవక్తను చేర్చుకొనువాడు ప్రవక్తఫలము పొందును; నీతిమంతుడని నీతిమంతుని చేర్చుకొనువాడు నీతిమంతుని ఫలము పొందును. [42]మరియు శిష్యుడని యెవడు ఈ చిన్నవారిలో ఒకనికి గిన్నెడు చన్నీళ్లు మాత్రము త్రాగనిచ్చునో వాడు తన ఫలము పోగొట్టుకొనడని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను.**

**వచనము 40. మిమ్మును చేర్చుకొనువాడు నన్ను చేర్చుకొనును**ని యేసు తన అపొస్తలులకు తెలియజెప్పాడు. "చేర్చుకొనును" అను పదము యొక్క అర్థము 10:9–15 చేత విదితము గావింపబడుచున్నది. అపొస్తలులను వారి ఇళ్లలోనికి చేర్చుకొని వారికి భోజనము పెట్టి ఆ తరువాత వారి బస నిమిత్తము తగు ఏర్పాట్లు చేసినవారు యేసు ఇచ్చట భావించినట్లు "చేర్చుకొన్నారు." నేటి క్రైస్తవులు, అపొస్తలుల వలె, యేసు నామములోను మరియు ఆయన అధికారముతోను లోకములోనికి వెళ్లుచున్నారు (28:18–20). సువార్తికుని "చేర్చుకొను" వాడు, ఆచరణలో, యేసునే చేర్చుకొనుచున్నాడు (గలతీయులకు 4:14). దీనికి వ్యతిరేకమైన భావములో యేసు శిష్యులను హింసించువారు యేసునే హింసించుచున్నారు (అపొస్తలుల కార్యములు 9:1–4). యూదా మత బోధకుల సాంప్రదాయమొకటి ఇలా చెప్పుచున్నది, "మానవుడు, వానికి వాడే ప్రతినిధియై యున్నాడు."[15]

**నన్ను చేర్చుకొనువాడు నన్ను పంపినవాని చేర్చుకొనును**ని యేసు వారికి గుర్తుచేసాడు. యేసు హేతువును పోషించుట ద్వారా, ఒకడు ఆయనను పంపిన తండ్రిని గౌరవించుచున్నవాడగును (మార్కు 9:37; లూకా 9:48; యోహాను 13:20).

**వచనము 41**. ఆయన చేసిన ప్రకటనలో యేసు ప్రవక్తలను కూడ కలిపాడు, **ప్రవక్త అను పేరునుబట్టి ప్రవక్తను చేర్చుకొనువాడు ప్రవక్త ఫలము పొందును.** "ప్రవక్త అను

పేరునుబట్టి” అను పదజాలము ఒక “హెబ్రీయవాదమై యున్నది, ‘ఒక ప్రవక్తగా’ అని దాని అర్థము.”[16] 41ఎ వచనములోని తొలి మాటలు “ఒకడు ప్రవక్తయై *యున్నందునుబట్టి* ఆ ప్రవక్తను చేర్చుకొనువాడు” అని విల్యమ్ హెండ్రిక్సెన్ అనువదించాడు.[17] ప్రతిఫలము పొందవలెనను ఆశనుబట్టి కాదు, కానీ ఒకడు ఎవరై యున్నాడో యను ఆలోచననుబట్టి దేవుని సందేశకుని చేర్చుకొనువాడు, అతడే ఒక ప్రవక్తయైయున్నట్లు ప్రతిఫలము పొందునను అభిప్రాయము ఈ మాటల్లో దాగియున్నట్టు అగుపించుచున్నది. ఆది సంఘములో ప్రవక్తలు మరియు ప్రవక్త్రిలు ఉండిరి (అపొస్తలుల కార్యములు 11:27–30; 13:1; 21:9–11; 1 కొరింథీయులకు 12:28; ఎఫెసీయులకు 2:20; 3:5). ప్రవచన వరము ఆశ్చర్యజనకమైన వరములలో ఒకటై యుండి, ఆది క్రైస్తవ్యముతో అంతమైన ప్రవచనము, ఒక వరమై యుండినది (1 కొరింథీయులకు 13:8 చూడు).

**ఒక నీతిమంతుని** (*dikaios*) యెడల ప్రదర్శింపబడిన ఇదే విధమైన ఆతిథ్యము కూడ సరిసమానంగా ఆశీర్వదింపబడునని 41బి వచనములోని రెండవ భాగము సూచించుచున్నది. *Dikaios* అను పదము న్యాయవంతుడును మంచివాడునై యుండి, వాని జీవితము అంగీకరింపబడిన దేవుని నియమములకు బద్ధమైయుండునట్లు వాటిని అంటిపెట్టుకొని యుండుటను సూచించుచున్నది. “ప్రవక్తలు” మరియు “నీతిమంతులు” మత్తయి వ్రాసిన సువార్తలో మరొక చోట కలిపి పేర్కొనబడి యున్నారు (13:17; 23:29). ఈ పదజాలము ఒక సమానార్థక సమాంతరములో పరస్పరము మార్పిడి చేసికొనబడుచు ప్రయోగింపబడవచ్చును. నీతిమంతులు ప్రేరేపింపబడలేదు, కాబట్టి ప్రవక్తలు నీతిమంతుల నుండి విలక్షణముగా గుర్తింపబడిరనునది మరొక సాధ్యతయై యున్నది. ఈ వచనములో, “నీతిమంతుడు” అను పదము ఆది సంఘములోని ఒక “ఉపదేశకుని” సూచించుట కూడ సాధ్యమే (1 కొరింథీయులకు 12:29; ఎఫెసీయులకు 4:11; యాకోబు 3:1 చూడు).

**వచనము 42. ఈ చిన్నవారు** అను పదము అపొస్తలులను సూచింపవచ్చును (మార్కు 9:42 చూడు), లేక మొత్తంమీద యేసు అనుచరులని అర్థమీయవచ్చును (18:6, 10, 14; మార్కు 9:42; లూకా 17:2 చూడు). ఈ వర్ణన ముదులొలుకుచున్న విషయమును తెలియజేయు ఒక పదమై యుండును. ఆయన ఉద్దేశించి రచించుచుండిన క్రైస్తవులందరి గూర్చి ప్రస్తావించుటకు యోహాను ఇదే విధమైన అభివ్యక్తమును, “చిన్నపిల్లలారా” అని ప్రయోగించాడు (1 యోహాను 2:1, 28; 3:7, 18). మరొక ప్రక్క అది ప్రాపంచిక ప్రమాణాల ప్రకారము – “మిక్కిలి అల్పులైన యీ నా సహోదరులు” (మత్తయి 25:40; NIV) – శక్తిమాలినవారు మరియు అల్పులైనవారి గూర్చి నొక్కివక్కాణించు ఒక వర్ణనయై యుండవచ్చును.

చేయబడిన అత్యల్పమైన సేవలు సహితము, **త్రాగుటకు గిన్నెడు చన్నీళ్లు ఇచ్చుట** వంటివి, గుర్తింపబడును (25:31–46). ఒకరు మరొక తోటి విశ్వాసికి భోజనము సమకూర్చలేకపోవచ్చును లేక బస చేయుటకు వసతి కల్పించలేకపోవచ్చును; కానీ అతడు చేసిన దయగల కార్యము ఎంత అల్పమైనదైననూ, అతడు తన **ప్రతిఫలమును పోగొట్టుకొనడు**.

యేసు తన అపొస్తలులకు పరిమితమైన బృహత్కార్య భారమును ఇచ్చిన తదుపరి, వారు బయలుదేరారు (మార్కు 6:12, 13; లూకా 9:6). అటుతరువాత వారు తిరిగి యేసు

నొద్దకు వచ్చి వారు సాధించిన సేవా ఫలితమును ఆయనకు నివేదించారు (మార్కు 6:30; లూకా 9:10).

✧✧✧✧✧ **పాఠములు** ✧✧✧✧✧

### అపొస్తలుల మరణములు (10:28)

"ఆత్మను చంపనేరక దేహమునే చంపువారికి భయపడకుడి" అంటూ యేసు తన అపొస్తలులకు సెలవిచ్చాడు (10:28). వీరు యేసు మాటలు వారి హృదయములకు హత్తుకొన్నారు; అపొస్తలులందరు కూడ వారి లక్ష్యసిద్ధి నిమిత్తమై తమ ప్రాణములను బలిదానం గావించారనియు, యోహాను మాత్రం వృద్ధాప్యంలో మరణించాడనియు సాంప్రదాయికమైన మూలధారములు సాధికారపూర్వకంగా చెప్పుచున్నవి.[18] ఎచ్చోట మరణించారు, వారు మరణించిన విధానమేమిటి యను విషయంలో ఈ మూలాధారములు కొన్ని పర్యాయములు ఏకీభవించవు. కానీ అపొస్తలులు ప్రదర్శించిన సాహసస్థైర్యములు మరియు నిబద్ధత గూర్చి చెరగని ముద్రవేయుచున్నవి. వారు క్రీస్తును గూర్చి కలిగియుండిన మంచి సాక్ష్యమునుబట్టి రాళ్లు రువ్వబడి చంపబడిరనియు, శిరచ్ఛేదము గావింపబడిరనియు, సిలువవేయబడిరనియు నివేదింపబడినది. ఈ వర్ణనలు క్రొత్త నిబంధనలో వ్రాయబడి యున్నట్లు, స్తెఫెను రాళ్లతో కొట్టబడిన సంఘటన మరియు యాకోబు ఖడ్గము చేత హతమార్చబడిన సంఘటనతో సంగతత్వముగలవై యున్నవి (అపొస్తలుల కార్యములు 7:58; 12:2).

డేవిడ్ స్టూవర్ట్

### మంచి ఒప్పుకోలు (10:32)

అతడు తన బాప్తిస్మము సమయంలో ఒప్పుకొనిన మంచి ఒప్పుకోలును క్రైస్తవుడు నిర్వహించుకొనుచుండవలెను. వాడు తన అనుదిన జీవిత విధానము, మరియు యేసు క్రీస్తు నందలి విశ్వాసమును ఇతరులతో పంచుకొనుట ద్వారా ఈ సత్యమును ప్రదర్శించుచుండును. "విశ్వాస సంబంధమైన మంచి పోరాటమును పోరాడుము. నిత్య జీవమును చేపట్టుము, దాని పొందుటకు నీవు పిలువబడి అనేక సాక్షుల యెదుట మంచి ఒప్పుకోలు ఒప్పుకొంటివని" చెప్పుచు తిమోతి గూర్చి పౌలు తన హృదయంలో ఉండిన తీవ్ర వాంఛను వెల్లడించాడు (1 తిమోతి 6:12; NIV).

డేవిడ్ స్టూవర్ట్

### నిన్ను నీవు దక్కించుకొనుట (10:39)

వాడు "తనను తాను దక్కించుకొనుటకు" ప్రయత్నించుచున్నాడని మనము కొన్ని పర్యాయములు ఒక యౌవనుని గూర్చి చెప్పుచుందుము. అనేకులు వారు పాల్గొను క్రీడలు, అభ్యసించు అభిరుచులు, గడించిన డిగ్రీ (విద్య), మరియు చేయుచుండు వృత్తి వంటి చట్టబద్ధమైన కార్యకలాపములు ద్వారా తమ్మునుతాము దక్కించుకొనుటకు ప్రయత్నించుచుందురు. ఇతరులు మాదకద్రవ్యకములతో ప్రయోగములు చేయుట, లేక లైంగిక సంభోగ సంబంధములలో అనాచారముగా ప్రవర్తించుట వంటి చట్టబద్ధముకాని

పనులు ద్వారా తమ్మునుతాము దక్కించుకొనుటకు ప్రయత్నించుదురు. చివరకు, వారికి వీటన్నిటిలో ఏ ఒక్కటైననను సంతృప్తినీయదు. దావీదు కుమారుడును, రాజునైన సొలొమోను తన జీవితమును దక్కించుకొనునట్లు నానావిధములైన పనులు, సిరిసంపదలు, మరియు స్త్రీల వెంటబడ్డాడు – కానీ చివరకు అసంతుష్టిగాను నిరర్థకంగానూ బయటపడ్డాడు. గనుక ఒకడు వాని జీవితమునకు గల పరమార్థమును వాడు దేవునితో కలిగియుండు సంబంధములోనే కనుగొని దాని దక్కించుకొనగలడని అతడు తన తుది అభిప్రాయమును ప్రకటించుకొన్నాడు (ప్రసంగి 12:13, 14). నేటి ప్రజలు సహితము క్రీస్తును వెంబడించుట ద్వారా వారి జీవిత సాఫల్యమును కనుగొనగలరు మరియు దానిని దక్కించుకొనగలరు. ఈ మార్గము తనను తాను ఉపేక్షించుకొనుచు బలిదానం గావించుట గూర్చినదై యున్నది, గనుక యథార్థమైన సంతృప్తినిచ్చే మార్గం, ఇదొక్కటే.

డేవిడ్ స్టూవర్ట్

---

సూచనలు

[1]Talmud *Berakoth* 58b. [2]Douglas R. A. Hare, *Matthew*, Interpretation (Louisville: John Knox Press, 1993), 115. [3]David E. Aune, “Beelzebul,” in *The International Standard Bible Encyclopedia,* rev. ed., ed. Geoffrey W. Bromiley (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1979), 1:447–48; and Theodore J. Lewis, “Beelzebul,” in *The Anchor Bible Dictionary*, ed. David Noel Freedman (New York: Doubleday, 1992), 1:638–70 చూడు. [4]Talmud *Shabbath* 35b. [5]Walter Bauer, *A Greek-English Lexicon of the New Testament and Other Early Christian Literature,* 3d ed., rev. and ed. Frederick W. Danker (Chicago: University of Chicago Press, 2000), 1098–1100. [6]R. T. France, *The Gospel According to Matthew,* The Tyndale New Testament Commentaries (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1985), 186. [7]Robert H. Mounce, *Matthew*, New International Biblical Commentary (Peabody, Mass.: Hendrickson Publishers, 1991), 97. [8]Bauer, 145. ఒక దేనారము కూలివానికి ఒక దిన కూలియై యుండినది (20:13). [9]David Menton, “The Amazing Human Hair,” *Answers* (July/September 2007): 77. [10]Jerusalem Talmud *Shebiith* 9.1. “పరలోకము లేకుండా” అను మాటలు దేవుని ఎరుక లేదా ఆయన సర్వభౌమత్వమును సూచింపవచ్చును.

[11]Pliny *Letters* 10.96. [12]Plutarch *Moralia* 554B. [13]David Hill, *The Gospel of Matthew,* The New Century Bible Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1972), 195. [14]James Burton Coffman, *Commentary on Matthew* (Austin, Tex.: Firm Foundation Publishing House, 1977), 146. [15]Mishnah *Berakoth* 5.5. [16]Jack P. Lewis, *The Gospel According to Matthew,* Part 1, The Living Word Commentary (Austin, Tex.: Sweet Publishing Co., 1976), 157; NEB చూడు. [17]William Hendriksen, *New Testament Commentary: Exposition of the Gospel According to Matthew* (Grand Rapids, Mich.: Baker Book House, 1973), 478; NIV చూడు. [18]William Byron Forbush, ed., *Fox’s Book of Martyrs* (Philadelphia: Universal Book and Bible House, 1926), 2–5 చూడు.